రామదాసు మళ్ళీ పుట్టాడు

"బ్యూటిఫుల్, బాలాజీ, సింప్లీబ్యూటిఫుల్" బైనాక్యులర్స్‌తో తనివితీరా కొండ కిందినుంచి కనబడ్డ దృశ్యాన్ని చూసి అంది జోతి. ముందున్న బండ మీదినుంచి కాలుతీసి చదునుగా ఉన్నచోట వెయ్యాబోయి, తూలింది. బాలాజీ వెనకనుంచి ఆమె నడుంమీద రెండు చేతులూ వేసి పడిపోకుండా ఆపాడు. 'సారీ' అన్నాడు.

"నా బెటాల్.... థాంక్స్యు, మీరు పట్టుకోకపోతే పదహారు వందల రూపాయల బైనాక్యులర్స్ బండలపాలై నాశనమయ్యేది."

బాలాజీ అనుభవం వున్న గిరిజను డిలా చకచకా కొండదిగి పోతూవుంటే అతని పరుగు అందుకోలేక "ఉండండీ మరీ-" అని గునుస్తూ మొదట అతని భుజాన్నీ, తరవాత అతని చేతినీ పట్టుకుని దిగింది.

రైల్వేలైను వెయ్యడానికని కొండ సానువులో నేల కొంత చదును చేసేరు. అక్కడికి చేరేసరకి అతని మోచేతికి ఆమె మోచెయ్యి పెనవేసుకుని ఆకలీ అనుభవం సమపాళ్ళలో వున్న ప్రేమికుల్లా కనబడ్డారు.

అక్కడ జలలోంచి పడుతున్న నీళ్ళు తాగారిద్దరూనూ. "అబ్బ, ఐస్ కూల్డ్ వాటర్ కన్నా చల్లగా వున్నాయి" అంది జోతి.

"ఈ టన్నెల్లోంచి అవతలి వేపుకి వెడితే అక్కడొక అత్యద్భుతమైన వంతెన ఉంది. అది చూడాలి నువ్వు. ఓపికుంటే నడు" అన్నాడు బాలాజీ లైను మీద కొంతదూరం జోతిని నడిపించి.

"టన్నెల్ పొడవు" అన్న అంకెచూసి "మైగాడ్, రెండువందల మూడు మీటర్లా? అంటే వొక ఫర్లాంగుంటుందా?" అంది జోతి ఆ అంకెమీద వేలు పెట్టి.

"ఈ లైనుమీద ఈ సెక్షన్‌లో వున్న సొరంగాలు మొత్తం నలభై అయిదనుకొంటాను. అందులో వొకదాంట్లో ఎనిమిది వందల యాభై మీటర్ల పొడ వుంది తెలుసా!.... అంటే, దగ్గిర దగ్గిర నాలుగున్నర ఫర్లాంగులన్నమాట."

"అంతా చీకటే?"

"ఆ, అంతా చీకటే అవ్వాలసింది. కాని, అదృష్టవశాత్తు సొరంగం ఓ రెండు నోట్ల మరీ కొంత మధ్యనుంచి కాకుండా హద్దుకి; పది, పదిహేనడుగుల దూరంలో వెళ్ళడం తటస్థించింది. ఆ రెండు చోట్లా ట్రాక్ మీదికి వెలుతురు పడేటట్టుగా మిగిలిన కొంత భాగాన్ని పగలగొట్టి సబ్‌టన్నెల్స్ ఏర్పాటు చేసేరు."

"ఇప్పుడీ రెండువందల మూడుమీటర్ల టన్నెల్లో అలాంటి వెంటిలేటర్స్ లేవా?"

"ఊఁహూ.... లేవు— ఇంకా నయమే మరి కొంచెం అవతల నాలుగు వందల పదిహేను మీటర్ల టన్నెలొకటుంది. అందులోనూ లేదు, అంటే రెండు ఫర్లాంగుల మేర అందులోంచి మనుషులు కటికచీకటిలో అంతా రాతిగాలిపీలుస్తూ వెళ్ళాలన్నమాట"

"రాతిగాలే కదా. అందువల్ల ప్రమాదమేమీ లేదుగా."

"జియాలజీ చదివావు కనక నువ్వలాగే అంటావు. కాని, ఆ సొరంగం నిర్మాణం జరిగిన నాటినుంచి నేటివరకు- అంటే అయిదేళ్ళపాటు... ఆ రెండు ఫర్లాంగుల మేర ఏర్పరచిన నేలమీద ఒక్క చుక్క అయినా నీరు పడలేదు. నీరుపడిన నేలమీంచి వచ్చే అరోమా— స్మెల్లాఫ్ ది సాయిల్.... తియ్యగా ఉంటుంది కదా. ఆ తీపి అక్కడ వుండదు."

"అయ్యా బాబోయ్. ఏమిటా చప్పుడు. మన ముందునుంచి రైలుగానీ వస్తోందేమిటి, కొంపదీసి— అయ్యో ఇక్కడ చిక్కుపడిపోయామే ఎలాగ?"

"ఏం పరవాలేదు జోతీ; రైలొస్తే మంచిదే, కొంత లైటింగ్ వస్తుంది."

"లైటింగ్ వెనకనుంచొస్తే బావుండును. ముందునుంచి కళ్ళలోపడి ఒకటే గ్లేర్— ఎదరేముందో కనబడి చావటంలేదు."

"గాభరాపడకు.... నువ్వు ఆ బండమీదికెక్కు. నేనిటువేపు ఈ బండ మీదికెక్కిపోతాను— ఊ, త్వరగా!.... అమ్మయ్య, నుంచునేవుండు. రాతి వైపు వంగో; అంతేగాని రైలువేపు వంగకు.... తెల్సిందా? ఓ. కే....సీయూ"

ఆ రైలు పూర్తిగా వెళ్ళిపోయేలోగా భయంకరమైన ఒంటరితనం అనుభవించింది జోతి. బాలాజీ కూడా ఈ బండమీదికే ఎందుకెక్కడు కాదు!.... ప్రాణంలేని నలభై ఏడు వ్యాగన్లు డబ్‌డబ్‌మని ఫన్ ఫన్ మని వికారంగా చప్పుళ్ళుచేస్తూ చివర్ని వున్న పాసింజరు బోగిలోంచి ఎవరో తనసిచూసి ఏదో

పాటలాంటి అరుపు.... గార్డు అనుమానంగా చూసినట్టయింది— వెనకాల వున్న ఇంజన్‌లోంచి తెల్లపాంటూ, ఎర్రచొక్కా. తెల్లటోపీ ధరించిన నడికారు మనిషి మాత్రం "టాటా" చెప్పేడు. "ఇద్దరం కలిసి ఒకే దగ్గిర నిలబడుంటే యెంత బావుండేదో" అనుకుంది జోతి,

మళ్ళా భయంకరమైన చీకటి—

బాలాజీ ఒక్క చెయ్యే అందించాడు. తడుముకుని రెండో చెయ్యి అందుకుని, చంటిపిల్లలా అతన్ని కరుచుకుంది; ఆర్థియాలజీతో మాస్టర్ డిగ్రీకి చదువుతున్న మిస్ జోతి పవన్‌కుమార్ చౌధురి. "గొప్పగా వుంది. బాలాజీ! క్వయిట్ త్రిల్లింగ్!"

"అవును, త్రిల్లింగే, ఇంకా అప్పుడే ఏం చూశావు? అని. కౌగిట్లోంచి ఆమెని ట్రాక్ మీదికి మధ్యగా దింపుతూ అన్నాడు బాలాజీ" కొంచెం త్వరగా నడు నీకో పూంచి అద్భుతం చూపిస్తాను!" అని, ఇంతసేపూ నడిచిన వేగానికి నాలుగింతలుండే వేగంతో జోతి చెయ్యి పట్టుకుని పరుగెత్తించాడు.

బాలాజీ చెప్పేడు కనక అది అద్భుతమే అయ్యుంటుందన్న నమ్మకంతో ఉత్కంఠ పెంచుకుని. జోరుగా, తన్నుకుంటున్న రాళ్ళను లెక్కయినా పెట్టకుండా నడిచి సొరంగం దాటేసి. అక్కడ లెవెల్ రాయి ఒకటుంటే దానిమీద కూర్చుండి పోయిందిజోతి, ఆయాసంతో రొప్పుతూ.

"అటుచూ, డటు చూడు!"

ఆ వేలికి తిన్నగా ఒక పెద్ద రైలు, ఎదురుగా పరుచుకుని వున్న కొండ స్లోపు మీదుగా, ఇప్పుడు వెళ్ళిన రైలుకి అభిముఖ దిశతో పరుగెదుతోంది,

"ఆ లైన్ ఎక్కడి కెడుతోంది మరి?"

"అదే, నేను చూపిస్తానన్ని అద్భుతం... ఆ రైలూ, ఇప్పుడు మనం టన్నెల్లో ఉండగా ఇటువేపు వెళ్ళిన రైలూ ఒక్కటే ఆ లైనూ ఈ లైనూ ఒక్కటే. అంటే ఈ సొరంగం గుండా. 'ఎస్' ఆకారంగల ఈ కొండని కొంత దాటి, అక్కడ సొరంగం తవ్వడం కూడా అసాధ్యం అయినందువల్ల మళ్ళా స్లోపు మీద వెడుతోందన్న మాట. రైలు. అర్థమైందా?

అర్థం కాకపోయేదే.... కాని ఆఖర్న వున్న ఇంజన్‌లోంచి ఇందాక తనకి "టాటా" చెప్పిన తెల్ల ప్యాంటూ ఎర్రచొక్కా టోపీ-దానికి ముందు గార్డు పెట్టె-దానికి ముందు పాసింజర్ బోగీ.... ....

మైమరచి, ఎప్పుడూ రైతే చూడని దాన్లా అలా చూస్తూ కూర్చుండి పోయింది జ్యోతి.

చూసింది రైలే అయినా స్మృతి పథంలో మెదిలినవి మాత్రం మానవుడు నిర్మించిన ఈ మహత్తరమైన రైల్వే లైను, ఈ లైన్ సందర్శనంద్వారా తన కిప్పటిదాకా కనబడ్డ చిత్ర విచిత్ర ఆశ్చర్యకర అద్భుత రమణీయ కమనీయ మనోజ్ఞ సుందర దృశ్యాలే.

చూపును అక్కణ్ణుంచిక్కడికి తెచ్చేలోగా, ఒకే కొండ తాలూకు రెండు ముఖాలైన ఆ స్లోపుకీ ఈ స్లోపుకీ మధ్య, విశాలంగా లోతుగా అద్భుతంగా వున్న లోయ కనబడ్డది. ఎంత విశాలమది? అక్కడ బరువయిన రైలు ఇనుప పట్టాలమీద ఆ వేగంతో నడుస్తూఉన్నా ఇక్కడికి అంత తక్కువ చప్పుడు విని పించేటంత!....ఎంత లోతు? దాదాపు అరవయ్యి, డెబ్భయి అడుగుల ఎత్తుండే తాటి, యూకలిప్టస్. టేకు ఓకు చెట్ల తలలన్నీ గజిబిజిగా; యూనివర్శిటీ లేడీస్ హాస్టల్ పై డాబా మీదినుంచి చూసినప్పుడు పక్కని సర్ బి.ఎన్. శర్మ గార్డెన్స్‌లో మిగిలిపోయిన ఖాళీ స్థలాల్లో పిచ్చిగా పెరిగిన పచ్చిగడ్డి మొక్కల్లా కనిపించినంత! మరి ఎంత అద్భుతం, అంటే, దానికి పరిమితీ అవధీ లేదేమో అనిపించేటంత!

"పద ఆ వంతెన చూద్దాం."

"ఊహూ. కాసేపిక్కడ కూర్చుని వెడదాం." అంది జ్యోతి.

"రెండు లెవెల్ పోస్టులు ఒక దగ్గర వెయ్యరు. మరి నేనెక్కడ కూచోను?"

"మీరూ దీని మీదనే నా పక్కన కూర్చోండి."

చాల్లేదు, స్థలం.

"వెలుతురు ఇంకెంతోసేపుండదు. ఇక్కడ పడమటి సూర్యుడికీ తూర్పు కనుమలు అడ్డొచ్చి అయిదున్నరకే వెల్తురు మాసిపోతుంది .... నీకు వంతెన చూడాలనుంటే వెంటనే బయల్దేరు....లేకపోతే వెనక్కి పోదాం."

"అదేం కుదరదు" అని తొక్కి వదిలిన స్ప్రింగులా లేచింది జ్యోతి. సొరంగం బయట ఉన్న రైల్ ట్రాక్ ప్రక్కని సన్నటి కాలిదారిగుండా ఒక అర్థకిలో మీటర్ నడిచారిద్దరూనూ." ఇంకా యెక్కడ మీరు చెప్పిన బ్రిడ్జి? అని నాలుగైదు సార్లడిగింది. "ఏం నడవలేక పోతున్నావా" .... "ఇదిగో

వచ్చేశాం...."...."ఆ ఓక్ చెట్లు కనబడుతున్నాయి చూడూ, అక్కడ!" ....అంత అద్భుతమైన వంతెన కాదనిపించవచ్చుగాని చాలా రోజులు గుర్తుండి పోతుందా దృశ్యం"....ఇలా చెప్పుకొని తీసుకొచ్చాడు బాలాజీ, వెనక నడుస్తున్న జోతిని.

కాలిదారిమీంచి రైల్ట్రాక్ ఎక్కాడు బాలాజీ. "జాగ్రత్తగా అడుగెయ్యి"

ఒకసారి దిగువకి చూడు, ఆ స్లీపర్లమధ్య ఖాళీలోంచి!" అన్నాడు బాలాజీ.

కళ్ళు తిరిగాయి జోతికి. "బాప్రే" అని అడుగు వెనక్కివేసి బాలాజీని పెనవేసుకుంది. అతను నెమ్మదిగా విడిపించుకుని "ఎలావుంది?" అన్నాడు చిరునవ్వుతో.

"అద్భుతం అన్నాదు మీదు. అన్యాయం. ఇది భయంకరంగా వుంది!"

ఈమాటు తనే అతన్ని పట్టుకుని వొంగి తొంగి చూసింది జోతి అక్కడ ఆ"కింద ప్రవాహం ఏమిటి? ఒక గీతలా వుంది; ఉందాలేదా అన్నట్టు!" అంది.

"తెల్లగా నురుగుంది, చూడు."

"ఔను,"

"తెల్లనివన్నీ పాలుకావు." నవ్వి, ఆమెని అక్కణ్నుంచి తప్పించాడు. "అట్టేసేపు చూడకు; కళ్ళు తిరుగుతాయి.

జోతికి కళ్ళు తిరగలేదు. ఆనందంతో చెమ్మగిల్లాయి. అంతే.

"ఆ నీళ్ళు పారేచోట నీటిజాలు వెడల్పు రెండుమీటర్లు.... నువ్వు గీతలా ఉందన్నావే. ఆ గీత వెడల్పు ఆరడుగులు! అక్కడ ప్రవాహాన్ని తాత్కాలికంగా ఆపి; దానికింద నాలుగు మీటర్ల పునాది తీసి, ముందుగా పోత పోసి ఉంచుకున్న ఉక్కు స్తంభాన్ని దాంట్లో నిలబెట్టేరు. ఆ స్తంభం పొడుగు; అంటే ఈ వంతెన ఎత్తు – నూటతొంభై రెండు అడుగులు. కనకనే ఆరడుగుల వెడల్పుగల నీటిజాలు నీకో సన్నటి గీతలా కనబడుతోంది."

"ఇదంతా జపాన్దేశపు ఇంజనీర్లు కట్టిందేగా."

"అదే, మన దౌర్భాగ్యం. ఏమాత్రం బాగున్నా అదేదో విదేశీ మహిమ అయ్యుంటుందనీ, ఏమాత్రం అపకారం జరిగినా అందులో విదేశీహస్తం వుందని అనెయ్యడం! .... సరిగ్గా ఇక్కడ యిమడక పోవచ్చుననుకో; అయినా ఇలాంటిదే ఒక జోకు చెప్తాను—ఆమధ్య ఒక సమాచార శాఖ ఉన్నతాధికారిణి

పుష్కరాల సీజన్‌లో ధవళేశ్వరానికొచ్చి ఆనకట్ట, కాలవల సిస్టమ్స్ చూసి బావున్నాయని తెగ మెచ్చుకోగా; అక్కడ స్థానిక అధికారి ఒకరు అదంతా కాటన్ దొరగారి చలవ అని విన్నవించుకోడం జరిగింది. దాంతో ఆ ఉన్నతాధికారిణి, "కాటనా? ఎవరాయన? ఇక్కడ కలెక్టర్ చేశాడా?" అని అడగడంతో చుట్టూ ఉన్న వాళ్ళకి మతులు పోయినంత పనైంది. ఆ "సమాచార" అధికారిణి చాలా కాలం టీచరుగా పనిచేసి, డి.ఇ.ఓ అయి, ఇంకా గొప్ప ప్రమోషన్ తెచ్చుకునీ కూడా "కాటన్"గారి పేరూ వివరం ఎన్నడూ వినలేదని రుజువైంది. అంటే ఏమిటన్న మాట, ఆంధ్రుల్లో కొందరు సర్ ఆర్థర్ కాటన్ ఎవరో, చార్లెస్ ఫిలిప్ బ్రౌనెవరో, ఆఖరికి మోక్షగుండం విశ్వేశ్వరయ్యగారెవరో గుర్తుపెట్టుకోక పోయినా ఎంతో ఉన్నతాధికారాలు నిర్వహించగల గుండె నిబ్బరం కల వాళ్ళయి పోతున్నారన్నమాట"

హఠాత్తుగా అతని వాక్ప్రవాహం ఆగిపోయింది.... వంతెన అవతలి వైపునుంచి గర్ మని చప్పుడు వినపడింది. "భలే. ఏం అదృష్టం." అన్నాడు. జోతిని ట్రాక్ మీంచి దింపాడు.

"ఏంటది?"

"ట్రాలీ. అందులో లిఫ్ట్ అడిగి, మనం రైలెక్కవలసిన స్టేషన్‌కి వెళ్ళి పోదాం."

o o o

దుర్భరమైన చలిని కేవలం డిపార్ట్‌మెంటల్ కబుర్లతో గడిపారు, జోతీ బాలాజీ. రైల్వే స్టేషన్‌కి సుమారు రెండు వందల అడుగుల దిగువన ఉన్న గ్రామానికి వెళ్ళి; ఉడికించిన పెండలందుంపలూ, కొర్రన్నంతిని, మేకపాలు తాగి; అర్ధరాత్రి వరకు స్టేషన్‌లో రైలుకోసం చూస్తూ గడిపారు. అతి కష్టం మీద రాత్రి పదిగంటలు దాటాక స్టేషన్ వరండాలోంచి లోపలికి ప్రవేశం సంపాదించారు.

"కిరండూల్" నుంచి ఇనుప ఖనిజం మోసుకొచ్చిన గుడ్స్ రైలు రాత్రి ఒంటి గంటన్నర కొచ్చింది ఆ స్టేషన్‌కి. అందులో ఉన్న ఒక్క పాసింజర్ బోగీలోను కిక్కిరిసి ఉన్నారు జనం. అయినా అందులో వొక బెంగాలీ కుటుంబం ఉన్నట్టు పసిగట్టి బాలాజీ, "వాళ్ళతో మీ భాష మాట్లాడు" అని మోచేత్తో పొడిచాడు జోతిని. "పని జరగొచ్చు. మనక్కావలసింది వొక్కసీటే.. మీవాళ్ళకి భాషాభిమానం మహామెండు కదా." అంటూ జోతి అతనిని కొట్టబోయినట్టు చేతులడ్డం పెట్టుకున్నాడు.

ఏమైతేనేం, మాట పనిచేసింది. భాష మేలు చేసి పెట్టింది కూడానూ.

o o o

ఉదయం ఏడు గంటలకి వాల్తేరు 'మార్షలింగ్ యార్డ్' దగ్గిర రైలు ఆగింది. జోతీ, బాలాజీ రైలు దిగి. "మద్రిపాలెం" బస్‌స్టాప్ కొచ్చి, ఇరవై తొమ్మిదో నెంబరు సిటీ బస్ వచ్చేలోగా 'డొక్కు-టీ' తాగి, బస్‌లో వచ్చి కృష్ణచైతన్య మఠం దగ్గిర దిగారు.

"ఈ ట్రిప్పులో చాలా కష్టపడుంటావు. కాని బాగా ఎంజాయ్ చేసుంటావని కూడా అనుకుంటాను." అన్నాడు బాలాజీ. కెమెరా సంచి అందిస్తూ.

"ఆ మాట వేరే చెప్పాలా? ఎంతో శ్రమ పడ్డాం, నిజమే. అయినా ఎంత సాధించాం!... ఏమాత్రం అలసటా విచారంలేవు నాకు. థాంక్యూ వెరి వెరి మచ్.... మరి, ఈ రెండు రోల్సులో ఫిలిం లన్నీ అర్జంటుగా డెవలపింగు ప్రింటింగు చేయించాలి. ఈ జ్ఞాపకాలు తలలోంచి చెదిరిపోకుండా నోట్స్ రాపేసుకోవాలి.... సాయంకాలాని కల్లా తెచ్చి ఇచ్చేస్తారుగా?"

* * *

స్నానం చేసి బట్టలు మార్చుకుందో లేదో, వార్డెన్ నుంచి కబురొచ్చింది. "మీ నాన్నగారొచ్చారు. హాస్టల్ ఆఫీస్ రూమ్‌లో నీకోసం చూస్తూ కూర్చున్నారు. అర్జంటుగా రా" అని.

అప్రయత్నంగా టైమ్ చూసుకుంది జోతి. ఎనిమిదీ నలభై. కాసేపు ఆలస్యమైతే మెస్‌లో టిఫినుండదు. ఈ ఆదివారం క్లాసులేమీ లేవు. అంచేత రాత్రి తీరని నిద్రా నిన్నటి అలసటా ఈ పూట తీర్చుకుందా మనుకుంది.

నాన్నగారొస్తె కారు ఉంటుంది. ఊళ్ళో ఆయన పలకరించగల బెంగాలీ మిత్రులు అయిదారుమంది ఉంటారు. వాళ్ళందరి ఇళ్ళకీ తీసికెడతాడు. ఎక్కడో "బ్రేక్‌ఫాస్ట్". మరెక్కడో "లంచ్". మధ్యలో ధారాపాతంగా 'టీ'లు. 'సనేన్‌సీ' హోటలు దగ్గిర 'ఈస్ట్ పాయింట్ గెస్ట్‌హౌస్'లో దిగుతారు. ఆఖర్న అక్కడికి చేరాలి. అప్పుడు తనవి నిజంగా నిండుగా పలకరిస్తాడు. "మరేంటి సంగతులు జోతీ డాళింగ్" అంటూనూ. డాడీకి చాదస్తం. వాల్తేర్ ఇనస్పెక్షన్ కొస్తె ఇరవైనాలుగు గంటలకి మించి ఎన్నడూ ఉండదు, కాని ఆయన వెళ్ళే చోటికల్లా తనూ వెళ్ళవలసిందే.

"కమాన్, జోతి డాళింగ్. ఎలా వున్నావు?"

తండ్రి దగ్గిర చేరి ఆయన కూర్చున్న కుర్చీ చేతిమీద అనుకుని బుగ్గ మీద ముద్దు పెట్టింది జోతి. "ఫైన్. డాడీ. ఎప్పుడు దిగావు?"

"నిన్న మెయిల్లో—"

గుండెలో రాయి పడింది జోతికి. ఒక్కసారిగా లేచి నిలబడి, బెదిరించి నట్టు వేలు చూపించి, "మరి....?" అని, కోపమో భయమో తెలీకుండా కళ్ళు పెద్దవి చేసి చూసింది.

"చాలా బిజీగా వున్నాను. నిన్నంతా. ఫర్గివ్ మి డాళింగ్....నిజానికి ఇవాళ నిన్ను చూడకుండా ఉండలేక వచ్చేశాను.... సరే; మనకెంతో టైమ్‌లేదు. నువ్వు వెంటనే బయల్దేరాలి. నిన్నొక మంచి ఎక్స్‌కర్షన్ స్పాట్ కి తీసికెడతాను. మనం ఈ రాత్రికి వై జాగ్ రాలేక పోవచ్చు. వచ్చినా ఏ పదకొండో.పన్నెండు గంటలో అయిపోవచ్చు....సరాసరి గెస్టుహౌస్ కెళ్తాం....సో—ఓ జతబట్టలూ, అత్యవసరమైన వస్తువులూ చిన్నపెట్టెలోనో బ్యాగ్‌లోనో వేసుకుని రా. మూణ్ణిమిషాల్లో రావాలి!"

జోతి, తను చాలా అలసిపోయివున్నాననీ, రాలేననీ చెబుదామని మాటల కోసం వెతుక్కుంది. వెర్రి అభిమానం డాడీ. ఎలాంటి బ్రతిమిలాట పెట్టినా అంతకి మించిన ముద్దుచేసీ మొహమాట పెట్టీ లాక్కుపోతాడు....

0 0 0

కార్లోనే ఉద్యోగ ధర్మం మొదలుపెట్టాడు, పవన్‌కుమార్ చౌధురి.

ముందు సీట్లో కూర్చున్న డిప్యూటీ ఛీఫ్ ఇంజినీరు. ఇతను ప్రశ్న ఏదైనా అడిగినప్పుడల్లా ఇటువేపు తలతిప్పి సమాధానాలు చెబుతున్నాడు. అలా, నిద్రలోకి జారుకుంది జోతి.

హఠాత్తుగా "లే. డాళింగ్" అన్న తండ్రి మాటకి మెలకువ వచ్చింది. "ఇక్కణ్నుంచి మనం జీపులో వెళ్ళాలి!"

చుట్టూ చూసింది జోతి, కారు దిగి. అన్నీ కొండలు. చలిగా ఉంది. స్వెట్టరు, మఫ్లరూ, బ్రీఫ్‌కేసులోంచి లాగి ధరించింది.

జీపులో ముందు సీట్లో మధ్యని కూర్చుని "ఎక్కడున్నాం డాడీ. మనం?" అనడిగింది. పవన్‌కుమార్ చౌధురి చిరునవ్వు నవ్వాడు. వెనక సీట్లో కూర్చున్న డిప్యూటీ ఛీఫ్ ఇంజినీర్, "తూర్పు కనుమ లంటారే. నాటి తూర్పు అంచున ఉన్నాం మమ్మా....మీరు నిద్రపోకండి. మంచి దృశ్యాలు మిస్సయిపోతారు" అన్నాడు.

"ఈ కొండల్లో అద్భుతమైన దృశ్యాలున్నాయి డాడీ."

ం ం ం

వొచ్చింది వేరే దార్లో అయినా, చేరింది నిన్నటి చోటికే కావడం; జోతికి చెప్పలేనంత విస్మయాన్ని కలిగించింది.

ఆ స్టేషన్‌లో రెండు మోటార్ ట్రాలీలు సిద్ధంగా ఉన్నాయి. స్టేషన్ మాస్టరు–నిన్న రాత్రి తనకి స్టేషన్‌రూమ్‌లో ఈజీచేర్ ఇచ్చినాయనే–తనవి చూసేడు కాని; పరిశీలించి "నిన్న టమ్మాయిలా వుందే" అనుకోడానికిగాని అనడానికిగాని కావలసినంత తీరుబాటుగా లేడు. పైగా తన వేషంలో మార్పు. అయినా జోతి "నమస్కారం సార్." అని తెలుగులో చెప్పింది.

"తమరు ఇనస్పెక్షన్ చెయ్యవలసిన ట్రాక్. ఈ స్టేషనుకి ఇటు రెండున్నర కిలోమీటర్లు. అటు ఒకటిన్నర కిలోమీటర్లూ ఉంది సార్. ముందుగా మనం దక్షిణం వైపు వెడతాం సార్, అట్నుంచి ఖాళీ రైలుబండి ఒకటొస్తుంది గానండి. ఇంకో రెండుగంటల వరకు రాద్సార్. ఇట్నుంచి ఒక లోడ్‌బండి వస్తుంది సార్. అయితే అది మనం యిక్కడికి తిరిగి వచ్చాకనే ఈ స్టేషన్ దాటాలని స్టేషన్ స్టాఫ్‌కి చెప్పాంసార్."

"ఓ. కె"

ట్రాలీలు కదిలాయి. నిన్నటి దృశ్యాలు మళ్ళా కనబడ్డాయి. మనసు ముచ్చట పడ్డా మౌనంగానే చూసింది జోతి టన్నెలు, వంతెన, అన్నీ దాటాక 64 కె. ఎం. అని వున్న ఒక రాయి దగ్గర ఆగాయి. ట్రాలీలు

అక్కడ ట్రాలీదిగి, ట్రాక్‌దిగి, ఫైల్లోంచి ఒక పెద్ద మ్యాప్‌తీసి పట్టుకున్నాడు డిప్యూటీ చీఫ్ ఇంజనీర్, కాగితం అంచులు మరెవరో పట్టుకున్నారు.

"ఇది, మొదట ప్రతిపాదించిన మార్గం సార్. అంటే తొలిసారి సర్వే (పరిశీలన) చేసిన మీదట ఆ ఇంజనీర్ ఇచ్చిన రిపోర్టు ప్రకారం సార్. అప్పుడు డి.ఇ.ఎన్. (డివిజనల్ ఇంజనీర్) రామదాసుగారు శెలవులోంచి డ్యూటీకొస్తె ఈ ప్రాజెక్టుకి వేశారు సార్. వార్ని. ఆయన ఈ మార్గాన్ని మళ్ళీ సర్వే చేయించి, మార్చిన మార్గం సార్, అంటే ఇప్పుడు నిర్మాణం అయిపోయి మనం ట్రాలీలమీద వొచ్చినది ఇదిసార్. ఈ రెండూ ఈ ప్లాన్‌లో వేర్వేరు రంగులలో గుర్తుగా చూపించాం, గమనించండి సార్, మొదటి మార్గం కంటె రెండోది ఏడువందల మీటర్లు పొడుగెక్కువ సార్.

మళ్ళా లైనను నిర్మాణం అరవై నాలుగో కిలోమీటర్ చేరే వేళకి ఆయన, సుఖంగా హాయిగా ఉండే పనిలో వేరేచోట ఉంటూ కూడా, తనంతట తానుగా అడిగి, ఈ ప్రాజెక్టుకి ట్రాంస్ఫర్ కోరుకున్నివచ్చారుసార్. అరవయి నాలుగు నుంచి అరవయి ఎనిమిదివరకు ఉన్న ఈ "రీచెస్"లో మామూలుగా అయ్యే ఖర్చుకన్నా సుమారు యాభయివేలు అధికంగా ఖర్చవుతుందని ఎస్టి మేట్లు వేసి ఆమోదం పొంది "బిల్సు" పాస్ చేసేరుసార్. అదిసార్, టూకీగా ఆడిట్ వాళ్ళ రిపోర్టు సారాంశం, ఇక మూడో పాయింటు సార్, విడిగా ట్రాక్ నిర్మాణానికి అయిన ఖర్చులో పెరుగుదల సంగతి అలావుంచి,అదనంగా వొచ్చి పడ్డ స్టేషను, దాని నిమిత్తం శాశ్వతంగా తగులుకొనే ఉద్యోగాలూ, క్వార్టర్సు మొదలయిన పద్దుల ద్వారా నిర్వహణ ఛార్జీలు, ఈ వర్క్ తనే ప్రతిపాదించేసి తనే చేయించడానికి రామదాసుగారు సిద్ధపడ్డం, ఇదంతా చూసి ఇందులో ఆయనకి లాభించేదేదో ఉండితీరాలని సి.బి.ఐ. వారు వేలెత్తి చూపిస్తు న్నారు సార్. ఆ తరువాత, డివిజనల్ ఇంజినీర్ రామదాసుగారి మీద డిపార్టు మెంటల్గా చర్య తీసుకోమనడం, ఆయన్ని సస్పెన్షన్లో పెట్టడం అవన్నీ తమకు తెలిసిన విషయాలే సార్."

పవన్కుమార్ చౌధురి అవన్నీ క్షుణ్ణంగా తనికీ చేసేడు....

* * *

స్టేషన్లో పవన్కుమార్ చౌధురికీ జోతికీ భోజనాలు ఏర్పాటయ్యాయి. కేరియర్ వాల్తేర్ నుంచి ప్రత్యేకంగా నిర్ణయించిన డీజిల్ ఇంజిన్లో వచ్చింది.

"రిపోర్టులూ ప్లానులూ చూస్చూసి విసుగ్గావుంది, అయినా, జోతిడాలింగ్, తప్పదు. మరొక్కసారి. ఈఆడిట్ రిపోర్టు ఆ సి. బి. ఐ. రిపోర్టు అలా చదివి వినిపించమ్మా." అని కూతురికి చెప్పి ఈజీచేర్లో నడుం వాల్చేడు, పవన్ కుమార్ చౌధురి.

o o o

అంతసేపూ దీక్షగా చదివి, ఆఖరు వాక్యం మొదట్లో తండ్రివైపు చూసింది జోతి.

"నిద్రపోతున్నట్లుంది" —అనుకుంది.

"డాడీ?"

"ఎస్, డాలింగ్! పూర్తిచెయ్. నేను నిద్రపోవడంలేదు."

"అదికాదు. మనం విశాఖపట్నం ఎలా వెడతాం? ఒచ్చినదారే. అంటే ముందు జీప్‌లోను, తరవాత కార్లోను. అంతేగా."

"అవును, ఏం?"

"ఎన్నిగంటలకి బయలుదేరుతాం?"

"ఓ సారీ!" లేచి కూర్చున్నాడు చౌధురి. "నీకిదంతా యమ బోరింగ్‌గా ఉండుండాలి... సరే. నా ఇన్స్‌పెక్షన్ అయిపోయిందిగా!.... వెంటనే బయలుదేర దామని చెప్తాను." లేచి నిలబడ్డాడు.

"అదికాదు డాడీ!" జ్యోతికూడా లేచి నించుంది. "నా ఉద్దేశం ఏంటంటే- మనం యిద్దరం—అంటే జస్టు మనం యిద్దరమే—అలావెళ్ళి ఓ గంటసేపు బయట తిరిగి రావచ్చా? లేకపోతే-నీకూడా వొచ్చిన అధికార్లు మనం వెంటనే వైజాగ్ వెళ్ళిపోవాలని పట్టుపడతారా?"

"లేదు- లేదు. గంటకాదు. రెండు గంటలైనా సరే, వాళ్ళు మనం తిరి గొచ్చేవరకు ఇక్కడే కాసుక్కూర్చుంటారు. నో ప్రాబ్లెం!"

o o o

"ఈ గుహలు. డాడీ-ఇవి వేలకొలది సంవత్సరాలక్రితం ఏర్పడినవి. అయితే, క్రీస్తుపూర్వం-అదీ మూడు, రెండు శతాబ్దాలమధ్య, ఎవరో వీటిని సంస్కరించి, తత్వవేత్తలకు వాసయోగ్యంగా చేసేరు. బౌద్ధ సంస్కృతి ప్రభావం కళింగరాజ్యం మీద పడినప్పటి శిల్పాలూ కుడ్య చిత్రాలూ మా ఇవి- ఇదిగో, ఈ రాతిపలకమీద శిల్పంచూడు. కనపడీ కనపడనట్టుందనుకో. అది బుద్ధుడి మహాభినిష్క్రమణం—" అదిగో అక్కడ బోధివృక్షంలాగా ఎవరో చెక్కారు చూడు! ఇందాక మనం చూసిన గుహలో భిక్షువుల ఆకారాలు, సన్న్యాసం స్వీకరించేటప్పుడు వాళ్ళు అవలంబించవలసిన విధులూ, సూచనా మాత్రంగా శిల్పాల్లో మలచారు చూశావుగా,"

"ఎస్. ఎస్. నువ్వు చూపించకపోతే ఇవన్నీ చూడకనే పోదును.... అయినా నువ్వు చూపించడంలో వింత ఏముంది? నీ చదువే ఇది కదా."

"ఇవి ఇక్కడ వుండి పోయినవి. అయితే బౌద్ధమతం వ్యాప్తిలో పరిణతిలో వున్న కాలంలోవివి. కొన్ని అవశేషాలు ఇక్కణ్ణుంచి తీసుకుపోయి నేషనల్ మ్యూజియంలో భద్రపరచారట తెలుసా?"

ఐతే, మీ వాళ్ళు రైల్వేలైను ఈ గుహలున్న చోటిని తాకకుండా

ఎక్కడో దూరం నుంచి పోయే విధంగా వేసేసిఉంటే; అత్యంత పురాతత్త్వ ప్రాముఖ్యం గల ఈ స్థలం; అటు రోడ్డుద్వారా అందుబాటులో ఉండక; ఇటు రైలుద్వారా కూడా చేరలేక మరుగున ఉండిపోయి ఉండేది! ఈ రైలుమార్గం ఎలా వెళ్ళాలి అనే విషయం మీద రెండోసారి సర్వే చేయించి నాయన (డివిజనల్ ఇంజినీరు రామదాసో ఎవరో అన్నారు, ఇందాక.) ఈ స్థలాన్ని రైలు ద్వారా చేరడానికి తగిన వీలు కల్పించి, ఇక్కడ ఒక స్టేషనుకూడా పెట్టించాడు. ఈ రైల్వేలైను రాకపూర్వం గుహలు చూడ్డానికొచ్చే యాత్రికులు కొండమార్గం గుండా, బండలమీదినుంచి, తుప్పల్లోంచి నడచి, ఈ ఎత్తుకిచేరి, ఇక్కణ్ణుంచి దేకురుకుంటూ, జారుకుంటూ, పడిపోతూ దిగేవాళ్ళు, మళ్ళా ఎక్కేటప్పుడు అంతకి అంతా బాధపడే వాళ్ళేమో కూడాను. ఇప్పుడు ఈ రైల్వేలైను నిర్మాణం పుణ్యమా అని. రైలుగట్టునుంచి గుహలవరకూ, మిట్ట పల్లాలకీ పక్కని గ్రానైటు రాయితో, సిమెంటుతో మెట్లు, వాటిమీద నడిచేవాళ్ళు పరధ్యానంగా ఉన్నప్పుడు తూలిపడిపోకుండా పక్కన స్టీలు రెయిలింగ్సు ఏర్పాటు చేశారు.ఆ రెయిలింగ్స్‌లో కొన్ని, ట్రాక్ నిర్మాణం కోసం వుపయోగించే పట్టాలు-ఇక్కడికి తీసుకొచ్చేలోగా వంగిపోయినవీ వాడారు. అవన్నీ నువ్వు కళ్ళారాచూశావు. మరొక్క విషయం డాడీ, ఆ గుహల్లోపల, రాతితోబాటు, బోలెడు ఖనిజ సంబంధమైన మట్టివుంది.అది వాతావరణ ప్రభావానికి కరిగిపోయి, కారిపోడానికి ఆస్కారం వుండేటట్టిది, ఇన్ని శతాబ్దాలనుంచీ అలాగే కరిగీ, రాలిపోతోంది కూడాను. అయితే, నేల అలాంటికోత పడిపోకుండా సిమెంటుతో అడ్డుకట్టి, వాననీళ్ళు వాటంతటవే జారిపోడానికి వీలుగా తూములు కట్టారు. ఆ విధంగా అపురూపమైన ఈ పురాతత్త్వ సంపదని కాపాడారు మీ రైల్వేవారు. దానికి పురాతత్త్వశాఖ విద్యార్థినిగా నా అభినందనలు డాడీ."

ఒకసారి కళ్ళు మూసుకుని. పాశ్చాత్య పద్ధతిలో వంగి, "థ్యాంక్యు మై చైల్డ్" అన్నాడు పవన్‌కుమార్ చౌధురి.

"నా అనుమానం ఏమిటంటే ఆ ఇంజినీర్ రామదాసుగారెవరో, కేవలం రైల్వే ఇంజినీర్‌గా కాకుండా, పురాతత్త్వ ప్రాముఖ్యంగల ఈ గుహలను దేశీయ విదేశీయ యాత్రికులు సందర్శించడానికి వీలు కల్పించే సంస్కారిగా, యిటన్నీ ఏర్పాటుచేసి, మనదేశమే స్వయంగా అమర్చవలసిన కనీస సౌకర్యాలు తానే ఒక ప్రతినిధి అయి సమకూర్చాడేమోననీ, అంచేత అతను చాలా గొప్ప

వాదనీనూ. అందువల్ల రైల్వేకి కొంత ఖర్చు తగిలించుండొచ్చు.కాని ఆ ఖర్చును భరించవలసిన బాధ్యత ఈ దేశానికి వుంది.దేశ ప్రభుత్వంలో ఒక శాఖ అయిన రైల్వేకికూడా వుందేమో, అది నువ్వు తేల్చాలి డాడీ."

"ఆపు." కోపంతో వూగిపోయి అరిచాడు పవన్‌కుమార్ చౌధురి. అంతలోనే తాను మాట్లాడుతున్నది ఎవరితోనో గుర్తొచ్చినట్లు, "క్షమించు చిన్నారీ, నువ్వు చెప్పినదంతా నిజమే కావొచ్చు. అతను నిజంగా గొప్పపనే చేసుండొచ్చు. మంచి దేశభక్తుడే కావొచ్చు, కాని, జోతీ డార్లింగ్, ఈ లోకంలో గాడిదపని గాడిదే చెయ్యాలి, కుక్కపని కుక్కే చెయ్యాలి! అంచేత, మనం విస్సహాయులం అమ్మా."

0 0 0

మర్నాటి వుదయం ఈస్ట్‌పాయింట్ గెస్టు హౌస్‌లో జోతికి ఆరు గంటలకే తెల్లవారింది: టెలిఫోన్ పిలుపుతో, తండ్రిని సరిగ్గా ఏడు గంటలకి లేపింది. అతనికి అలవాటయిన విధంగా వెంటనే "టీ" ఇచ్చింది.

"గుడ్మాణింగ్ డాడీ: టీ!"

"థ్యాంక్స్యు"

"నన్ను క్షమించు డాడీ. నీ బాధ్యతల్ని గుర్తించకుండా నిన్న: నీ పరిపాలనలో వేలుపెట్ట బోయానేమో!"

"ఓ—అలాంటిదేం లేదు."

"సరే. రామదాసుని బందిఖానాకి పంపుతావో, ఆయన ఉద్యోగం ఊడపీకుతావో అది నీ యిష్టం. నాదొక ప్రాబ్లెం ఉంది. నువ్వు వినాలి."

"చెప్పు డార్లింగ్. నువ్వు చెప్పింది నేనెప్పుడైనా విన్లేదు కనకా?"

"వింటావు కనకే చెప్తున్నాను—నాకొక గురువుగారు దొరికారు.ఆయన్ని పరిచయం చెయ్యనిస్తావా?—నిజానికి ఆయన్ని పరిచయం చెయ్యాలని ఆరు నెలల కిందట నువ్వు వచ్చినప్పుడే అనుకున్నాను. కాని నీ క్యాంప్ తేదీకి ముందు రోజునే అతను ఉద్యోగం కోసం ఢిల్లీకి ఇంటర్వ్యూ కెళ్ళవలసి వచ్చింది."

"ఎవరతను? మీ ప్రొఫెసరా?"

"కాదు. నేను గురువుగారన్నానని ఆయనేదో పెద్ద వయసు వారని అనుకోకు. అతని పేరు బాలాజీ. నాకంటె మూడేళ్ళు ముందుగా ఆర్కియాలజీలో

మాస్టర్ డిగ్రీ తీసుకొని, మొన్నీ మధ్యే డాక్టరేట్ డిగ్రీ కూడా తీసుకుని ఖాళీగా వున్నారు. చాలా తెలివిగల వారు. (ఛార్మింగ్‌గా ఉంటారు కూడానూ!) యు మే కాల్ హిం ఎ బాయ్‌ఫ్రెండ్; కాని ఆరకం హాట్ టైప్ కాదు. నేనిక్కడ చేరింది మొదలు నాకు నోట్సులు, డైరెక్షన్లు యిస్తున్నాడు. ఈ అయిదారు జిల్లాల్లో పురాతత్త్వ శాస్త్ర దృష్ట్యా గొప్పవీ, ముఖ్యమైనవీ అయిన ప్రదేశాలన్నీ కూడా నాకు స్వయంగా సాయంవొచ్చి చూపించేరు. అతని వల్ల నేను పొందిన జ్ఞానం యింతా అని చెప్పడానికి లేదు. మేం తిరిగిన ప్రదేశాలు, అక్కడ సంస్కృతీ చూసి, ఈ దేశ సంస్కృతి తాలూకు కొన్ని ముఖ్య అధ్యాయాలు ఆయన పరిచయం కాకపోతే తెలుసుకోలేక పోదునే అనిపిస్తుంది, ఇటు సింహాచలం, శాలిహుండం, శ్రీకూర్మం, ముఖలింగంనుంచి అటు వుండపల్లి, ఫిరంగిపురం, నాగార్జునకొండ వరకూ అలా చాలా వున్నాయి. అవన్నీ నాకు చూపించి ఎప్పటికప్పుడు నోట్స్ రాయించి, ఫోటోలు డెవలపింగూ ప్రింటింగూ చేయించి, ఈ చివరి పరీక్షలు రాయగానే ఒక పుస్తకం రాయడానికి తగినంత మేటర్ సమకూర్చి పెట్టారు బాలాజీ. నిజానికి నిన్న మనం చూసిన గుహాలు ఆయనతోనే నేను తొలిసారిగా చూశాను. అదీ ఎప్పుడో కాదు; సరిగ్గా ఒక్క రోజు ముందు, అంటే మొన్న—శనివారం....! అక్కడ నేను తీసిన ఫోటోలు నిన్నంతా కూర్చుని (పాపం ఆదివారం, ఎవర్నో ఆశ్రయించి) డెవలప్ చేయించి, ప్రింట్లు తీయించి, అవి నాకిద్దామని నిన్న సాయంకాలం హాస్టల్‌కెళ్ళాడట. నేనిక్కడ నీతో వున్నానని తెలిసి, రాత్రి ఇక్కడకీ వొచ్చాడట. మనం ఇక్కడకు చేరేసరికి పదకొండైందిగా. అంచేత కలుసుకోలేక పోయాడు. పొద్దుటే ఫోన్ చేసి చెప్పాడు. రమ్మన్నాను."

"ఓ. సర్లే. నీ రతనమంటే చాలా అభిమానంలావుంది. రానీ, చూద్దాం. తప్పేముంది?"

"అతన్ని చూడ్డం కాదుడాడీ. అతనికి ఎక్కడేనా ఓ మంచి ఉద్యోగం చూస్తావని కదా ఇదంతా నీకు చెప్పడం?"

○ ○ ○

రెండు చేతులూ జోడించి నమస్కారం చేసేడు బాలాజీ. పవన్‌కుమార్

చౌధురికి. "గుడ్‌మార్నింగ్ జోతి. ఇవిగో ఫోటోలు, కాంటాక్ట్ ప్రింట్స్ మాత్రం."

"కూర్చోండి' మిస్టర్ బాలాజీ.... ఆయనకి టీ ఇయ్యమ్మా జోతి" అన్నాడు. పవన్‌కుమార్ చౌదరి.

"నో, థ్యాంక్స్ సర్, అది సరే–జోతీ ఈయన మీ ఫాదరా?"

చిన్నగా నవ్వింది జోతి. "అవునూ" అని పాటలా అంది.

"ఏమిటి, సందేహం?" నవ్వాడు. చౌధురి.

"సారీ సర్! నాతో పరిచయం అయినప్పట్నుంచి జోతి తన తండ్రిగారు కల్కటాలో ఏదో వ్యాపారం చేస్తారని చెబుతూంది." నవ్వాడు బాలాజీ. ఈ రైల్వే గెస్ట్‌హౌస్‌లో గదులు వ్యాపారస్తులకి యివ్వరని నా అనుమానం....మీ పేరు చెప్పి మీరే సూట్‌లో వున్నారని అడిగితే మీ ఉద్యోగం హోదా చెప్పాడు వాచ్‌మేన్. చాలా ఆశ్చర్యపడ్డాడు."

"యు వార్ రైట్. యంగ్‌మాన్," అని నవ్వి, మరీ ఎక్కువ నవ్వితే బాగుండదన్నట్టు. ఆ నవ్వు పట్టుకుని బాత్‌రూం వేపు వెళ్ళాడు. పవన్‌కుమార్ చౌధురి.

"అలా ఎందుకు చెప్పావు జోతీ, ఐమ్ సారీ."

"సారీ అనవలసింది నేను బాలాజీ. ... తను అంత పెద్ద అధికారి అని చేస్తే ఎన్నో చిక్కులున్నాయని డాడీయే అలా చెప్పమన్నారు— డాడీ యీ వూరికి ఏడాదికి రెండు మూడు సార్లు క్యాంప్స్ వస్తారు —ప్రతిసారి వచ్చినప్పుడే మీ గురించి చెప్పి, ఆయన ఏమైనా ఇంప్రెస్ అయితే అప్పుడు మీకు చెబుదామనుకున్నాను. మీరా ట్రైనులో ఢిల్లీ వెళ్ళారు —ఇంకో తమాషా చెప్పనా? —మనం శనివారం వెళ్ళిన నోటికే ఆ గుహల దగ్గరకే. నిన్న, నేను మా డాడీతో, మరికొంతమంది ఇంజినీర్స్‌తో వెళ్ళాను." కొంచెం చిన్న బుచ్చుకుని, అది కప్పి పుచ్చుకోడానికి ధీరణి మార్చింది జోతి.

బాలాజీ మొహం ముడిచాడు. "ఆ ట్రైను, గుహలు, సెయిలింగ్స్ స్లిప్లు, వాటర్ అవుట్ లెట్స్ – అన్నీ ఇన్‌స్పెక్షన్ చేశారా మీ డాడీ?"

"డాడీ పూరికే ట్రాక్ చూసి బాలించుకున్నారు. నేనే ఆయన్ని విడిగా తీసుకెళ్ళి పురాతత్త్వ ప్రాముఖ్యమున్న ఆ స్థలాలన్నీ చూపించేను. అఫ్‌కోర్సు! ఆ విషయంలో డాడీకీ నాకూ అభిప్రాయ భేదంవొచ్చిందనుకో–నిన్నట్నించీ ఇవాళ తెల్లారే వరకూ నాకు డాడీ మీద కోపం వచ్చి మట్లాడం మానేశాను. ఆయనకు ఆ అభిరుచి లేక పోతే నన్ను ఆర్కియాలజి చదవమనడం దేనికి?"

బాలాజీ కదేమీ పట్టలేదు. "సరే. అయితే–ఇంజనీర్ని ఏం చేస్తున్నారు!"

"——— డిస్మిస్ చెయ్యొచ్చు. డాడీ మాత్రం ఏంచేస్తారు? వాతావరణం అంతా అతనికి ప్రతికూలంగా ఉంది పాపం. అదీ కాత అభిరుచి పేప–బాధ్యత వేరూ కదా."

"అలాగా" అన్నాడు బాలాజీ.

చౌధురి బాత్‌రూం లోంచి వచ్చాడు.

బాలాజీ నిలబడ్డాడు. మొహాన చిరునవ్వు ఉందా లేదా అన్నట్టు.

"ఐయాం సారీ సార్. ఈ ఫోటోలు జోతికి అర్జెంటుగా అందజేద్దామని మీ మకాంకి చొరవచేసి వొచ్చేశాను. అంతే.మీ పన్లకి అడ్డురావడం నా ఉద్దేశం కాదు. సెల విప్పిస్తె వెళ్ళొస్తాను."

"అంత అర్జంటుగా వెళ్ళిపోవాలా?.., కూర్చోండి."

ఇష్టం లేకపోయినా కూర్చున్నాడు. బాలాజీ. జోతి అప్పటికే తను చూడ్డం అయిపోయిన ఫోటోల దొంతర తండ్రి కిచ్చింది.అతను అతను వాటిని తిరగేస్తూ అన్నాడు. "అమ్మాయి చెప్పింది. ఆర్కియాలజీ మీద మీ అభిరుచి, అర్హత అన్నీనూ. అమ్మాయికి మీరు చేసిన సాయానికి థాంక్స్. మీకేదైనా ఉద్యోగం చూసిపెట్టమని అమ్మాయి చెప్పింది.అదీ ఓగంట కిందటే. దానిమీద అప్పుడే నేనొక మంచినిర్ణయం తీసుకున్నాను....మీకు జోతి చెప్పేవుంటుంది.— నాకీ ప్రపంచంలో. జోతి తప్ప వేరే ఏ లౌకికమైన అనుబంధమూ లేదు! సో. జోతి చెప్పింది అంటే నేను చేసి తీరవలసిందే. బోధపడిందా?"

"ఐయాం సారీ సార్....నాకు ఉద్యోగం ఇప్పించగలగడం మీకెంతో

సులభమని నాకూ తెలిసింది. కాని ఆ సహాయం మీనుంచి స్వీకరించలేను సార్, క్షమించండి." అని మళ్ళీ లేచాడు బాలాజీ.

ఏదో శక్తి తనని లాగినట్టు జోతి కూడా లేచింది. అతను వెళ్ళిపోతాడేమో. ఆపాలన్నట్టుగా అతని చెయ్యి పట్టుకుంది, "ఏమిటి బాలాజీ. ఇంతలోనే ఏమొచ్చింది. మీకు?....డాడీతో అలాగేనా, మాట్లాడ్డం? డాడీ మాట ఇచ్చారంటే....మీరసలు గర్వపడాలి, తెల్సా?" ఉద్వేగంతో అంది జోతి.

జోతి చెయ్యి విడిపించుకున్నాడు బాలాజీ. "ఆయన అధికారం, పలుకుబడి నాకు తెలియక కాదు జోతీ. నిన్నూ నాకు సెటిలానీ కాదు....నువ్వింతదాక అన్నావే బాధ్యత వేరూ, అభిరుచి వేరూ అని; ఆ మాటే చెబుతున్నాను." అన్నాడు.

నిర్ఘాంతపడి చూస్తున్న చౌధరివేపు తిరిగి అన్నాడు. "మన్నించి, క్షమించండి సార్. మేం అట్టే బాధ్యతల్లేనివాళ్ళం. కుర్రాళ్ళం. మేం చదువుకున్నది కేవలం వాక్కు విషయమే. దాంతోనే ఇప్పటిదాకా జీవించిన కాలం అంతా వెళ్ళబుచ్చడంవల్ల ఆ విషయంమీద అభిమానం, దురభిమానం కూడా ఏర్పడి వుండొచ్చు. మీ భావాలు అశేషమైన అనుభవాన్ని బట్టి అనంతమైన బాధ్యతల్ని బట్టీ ఏర్పడినవి. అంచేత మా ఆలోచనలూ మా అభిప్రాయాలూ వాక్కు త్రాసులో తూగకపోవచ్చు. వాటికి సత్య వంతెనవేర్పడ్డానికి వీలుకాకపోవచ్చు. కనుక, నేను మీ మెప్పు, ప్రాపకం పొందడం సమంజసం కాదు సార్. గుడ్ బై. నంచున్న పళంగా నాకు ఉపకారం చేద్దామని నిర్ణయించుకున్నందుకు వందనాలు."

వెనక్కి తిరిగి చూడనైనా చూడకుండా వెళ్ళిపోయాడు బాలాజీ. దారం కట్టినట్టు జోతి అతని వెనకే నడిచింది. ఆ దారంమీద పువ్వులున్నాయి. చిక్కుముడులున్నాయి. అతని సత్ప్రవర్తన- నిరుద్యోగం- అర్హత- నిరుత్సాహం- ఉద్యోగాలకి పడ్డే ప్రకటనలు- అప్లికేషన్లూ-వాటితో పంపే బ్యాంక్ డ్రాఫ్టులూ, పోస్టల్ ఆర్డర్లూ- ఇంటర్వ్యూలూ-వాటికోసం అయ్యే రైలు ఖర్చులూ, నిరాశలూ- తనకి అతనిమీద పెరిగిన గౌరవం- అతనెందుకో పడుతున్న ఈ కొత్త శోభ- ఏమిటి, ఏమిటి, ఏమిటిది? ఎందుకిలా?

తెర వొత్తిగిల్లినప్పుడు స్టీలు గొట్టాం మీద కదలాడిన రింగుల చప్పుడికి

తల వెనక్కి తిప్పేయొసేడు బాలాజీ. అతను పరంగా చిపర ఉన్నాడు. ఆ కళ్ళల్లో అప్పటికే ఎరుపూ చెమ్మా.

"అయిదేళ్ళ కిందట తొలిసారిగా వెళ్ళేను జోతీ, ఆ ప్రదేశానికి! ఆ దండకారణ్య మార్గంలో పడుతూ. లేస్తూ ఒళ్ళు గీరుకుపోయినా, బట్టలు చిరిగి పోయినా. ఉత్సాహమే ఉత్కంఠే బలం చేసుకుని చేరానక్కడికి. ఓ పక్క రైల్వే లైన్ల నిర్మాణం జరుగుతోంది. దాంతోబాటే ఆ గుహల పరిరక్షణ, సంక్షేమం,నదుపాయం;చూద్దం జరుగుతోంది. ఉపయోగిస్తున్నదంతా రైల్వే వారిచ్చిన సామాగ్రే. కడుతున్నది రైల్వే కాంట్రాక్టరే. అజమాయిషీ చేస్తున్నది రైల్వే ఇంజనీరే. అని తెలిసి నాకు ఒక్కసారిగా జన్మంతా మరిచిపోలేని గౌరవం కలిగింది, అభినందిద్దామని అక్కడ సైట్ ఆఫీసులో పున్న ఇంజనీర్‌గార్ని కలిశాను. రామదాసుగారు నా ఆవేశం చూసి నవ్వేరు. అక్కడ అప్పుడు నేను విన్న సంభాషణ ద్వారా- ఆ పనులన్నీ రైల్వేశాఖవారు చేయించడం లేదనీ, రామదాసుగారే స్వయంగా రిస్క్ తీసుకుని చేయిస్తున్నారనీ, కాంట్రాక్టర్ తనకు గిట్టుబాటు కావంటాడన్న ఊహతో అక్కడి ట్రాక్ నిర్మాణానికి మామూలుగా అయ్యే ఖర్చుకన్నా రూపాయికి పావలా లెక్కని ఎక్కువ అవుతున్నట్టు రామదాసుగారు ఎస్టిమేట్లలో చూపించారనీ తెలిసింది. రైల్వేశాఖమీద గౌరవం అలాగే వుండి, ఆ ఇంజనీర్ రామదాసుగారిమీద అభిమానం కలిగింది. వ్యక్తుల్లో ఉండే లోపాలే డిపార్ట్‌మెంట్లకి చెడ్డపేరు తెచ్చినట్టు; వ్యక్తుల్లో ఉండే విలువలు డిపార్ట్‌మెంట్లమీద గౌరవం పెంచవచ్చుకదా! నాటికి నేడు వారంరోజుల కిందట తెలిసింది; ఆనాడు రామదాసుగారు ఈ పన్లు చేయించి అందు మూలంగా రైల్వేకి తగిలించిన అదనపు ఖర్చుపల్ల ఆయన సస్పెన్షన్‌లో ఉన్నారని. ఎలా ఉన్నారు? చెబితే నమ్మరు! పదెనిమిదేళ్ళు ఇంజనీర్‌గా పని చేసిన రామదాసుగారికి ఏ బ్యాంకులోను కనీసం పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంకులోనైనా పట్టుమని పద్దెనిమిది రూపాయలు లేవు. సస్పెన్షన్ కాలంలో ప్రభుత్వం యిచ్చే అలవెన్స్‌తో కాల క్షేపం చేస్తున్నారు; ఆయనా, ఆవిడా, యిద్దరు పెళ్ళికెదిగిన కూతుళ్ళూనూ. స్వయంకృతాపరాధానికి పడిన శిక్ష (ఈ సస్పెన్షన్)ని ఆయన చిరునవ్వుతో స్వీకరించి, శాంతంగా ఇంటిపట్టున ఉండిపోయారట. అంతే. ఏ అధికార్లనీ- ఆశ్రయించకుండా. కర్మణ్యే వాధికారస్తే మాఫలేషుకదాచన- అని అక్షరాలా పల్లిస్తూ జీవితం గడుపుతున్నారట........

"ఆయన మనందరికంటే గొప్పవాడుకదా, జోతీ! నువ్వన్నది నిజమే అభిరుచి వేరు. బాధ్యతలు వేరు.... బాధ్యతలు నిర్వహించడానికి పరిపూర్ణ మానవుడక్కర్లేదు- యాంత్రికుడూ చెయ్యగలడా పని. కాని అభిరుచిని కాపాడుకోవాలంటే ప్రాథమికంగా మనిషై వుండాలి. అంచేత మీ నాన్నగారు తన బాధ్యతను ఎలాగ నిర్వహిస్తున్నారో, నేను నా అభిరుచిని రామదాసుగారిలాగే కాపాడుకుంటాను. ఆయనకా అధికారం వుంది. అలాగే నాకీ స్వతంత్రం వుందికదా....

"అంచేత నన్ను పోనీ జోతీ, నువ్వు బాధపడకు! గుడ్ బై" అని చకచకా మెట్లుదిగి వెళ్ళిపోయాడు బాలాజీ.

నీరసంగా ద్వారంవరకు వెనకడుగులు వేసుకుంటూ నడిచి- ద్వారం తగలగానే ఆగిపోయింది జోతి. అక్కడ చేరబడి, ఇటువేపు మొహంపెట్టి 'డాడీ' అని ఆక్రందించింది. అటువేపు తిరిగి "బాలాజీ, డోంట్ గో" అని అరచింది.

తెర పక్కనేవున్న పవన్‌కుమార్ చౌధురి, కూతురు ఆ ద్వారం దగ్గిర కూలబడిపోతూవుంటే పట్టుకుని, నిలబెట్టి, అక్కున చేర్చుకుని, "డోంట్ వర్రీ మై డార్లింగ్ జోతీ, నువ్వే గెల్చావు. దామ్మా!......రెండూ చేద్దాం....ఒప్పుకున్నానుగా. నీ బాయ్ ఫ్రెండ్ ఆ రామదాసు కంటె కూడా ఉన్నతుడు!" అన్నాడు.

*

894.8133/08
RAM
Acc No. 11960